ఐటీ రంగాన్ని అభివృద్ధి పర్చడమే లక్ష్యం

- మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్
- దావోస్‌లో త్రీసీస్ కంపెనీ సీఈవో ఫ్రాన్జీతో సమావేశం

దావోస్‌లో త్రీసీస్ కంపెనీ సీఈవో ఫ్రాన్జీతో మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్

మెదక్, జనవరి 17 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ రాష్ట్రంలో ఐటీ రంగాన్ని మరింతగా అభివృద్ధి పర్చడమే లక్ష్యంగా దావోస్‌కు వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీ, శాసన సభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబును మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ బుధవారం కలిశారు. దావోస్‌లో ప్రపంచ ఎకానమిక్ ఫోరం ఆధ్వర్యంలో జరుగుతున్న సమావేశాల్లో తెలంగాణకు పెట్టుబడులను ఆకర్షించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా త్రీ సీస్ కంపెనీ సీఈవో ఫ్రాన్జీతో ఎమ్మెల్యే రోహిత్ పెట్టుబడులపై చర్చించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ రివోల్యూషన్ స్పేస్, ఫ్యూచర్ టెక్నాలజీపై దావోస్ సదస్సులో ఎమ్మెల్యే రోహిత్ మాట్లాడారు.

ఇంటింటికీ రాములోరి అక్షింతలు

అక్షింతలు పంచుతున్న సర్పంచ్ అనిల్‌కుమార్

నిజాంపేట, జనవరి 17 : మండలంలోని వెంకటాపూర్(కే)లో సర్పంచ్ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం అయోధ్య రాముడి అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు కిష్టయ్య, నందు, రాజలింగంగౌడ్, రాజేందర్, సాయిలు, స్వామి, అశోక్, వికాస్, బన్నీ ఉన్నారు.

31లోగా చలాన్లు చెల్లించాలి

ధర్మారం(డీ) రోడ్డులో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

రామాయంపేట, జనవరి 17 : ఈ నెల 31లోగా వాహనదారులు ట్రాఫిక్ చలాన్లు చెల్లించాలని ఎస్సై రంజిత్ సూచించారు. బుధవారం రామాయంపేట శివారులోని ధర్మారం(డీ) రోడ్డులో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనదారులు కచ్చితంగా రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. టూ వీలర్, ఫోర్ వీలర్, ఇతర వాహనదారులు ఈ నెల 31లోగా పెండింగ్ చలాన్లు చెల్లించి, ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆటోడ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే జరిమానాతోపాటు కేసు నమోదు చేస్తామని ఎస్సై రంజిత్ హెచ్చరించారు.

కార్పెంటర్ దుకాణం దగ్ధం

దగ్ధమైన దుకాణాన్ని పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

రామాయంపేట, జనవరి 17: కార్పెంటర్ దుకాణం దగ్ధమైన ఘటన రామాయంపేటలో బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాలు.. రామాయంపేటకు చెందిన వడ్ల శ్రీనివాస్ మంగళవారం రాత్రి దుకాణం మూసి వేసి, పక్కనే ఉన్న ఇంటిలోకి వెళ్లాడు. రాత్రి ఒంటిగంట ప్రాంతంలో పెద్ద ఎత్తున శబ్దం రావడంతో శ్రీనివాస్ వెంటనే నిద్ర లేచి బయటకు వెళ్లడానికి ప్రయత్నించగా, ఇంటి తలుపులకు మంటలు అంటుకున్నాయి. కుటుంబ సభ్యులందరూ బయటకు వచ్చి, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఫైర్ ఇంజన్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పారు. దుకాణంలో వడ్రంగికి సంబంధించిన మిషన్లు, ఫర్నిచర్ కాలిపోవడంతో సుమారు రూ.8లక్షల నష్టం వాల్లినట్లు బాధితుడు శ్రీనివాస్ తెలిపారు. బాధిత కుటుంబాన్ని ఏఎంసీ చైర్మన్ మాజీ సరాఫ్ యాదగిరి, పీఏసీఎస్ చైర్మన్ చంద్రం, కౌన్సిలర్లు నాగరాజు, బీఆర్ఎస్ నాయకులు కొండల్‌రెడ్డి, చింటు తదితరులు పరామర్శించారు. బాధితుడి ఫిర్యాదుతో రామాయంపేట పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

వాసవి మాతకు ప్రత్యేక పూజలు


వాసవి మాతకు ప్రత్యేక పూజలు చేస్తున్న మహిళలు

రామాయంపేట, జనవరి 17: రామాయంపేట పట్టణంలోని వాసవిమాత ఆలయంలో బుధవారం ఆర్యవైశ్య మహిళా అధ్యక్షురాలు ఎనిశెట్టి శ్రీవాణి అధ్వర్యంలో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళా సంఘం ప్రతినిధులు బొమ్మెర్ల లావణ్య, గుండు శ్యామల తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న స్థానికులు

రామాయంపేట, జనవరి 17: రామాయంపేటకు చెందిన కటికె కమలాబాయి అనారోగ్యంతో మృతి చెందింది. మనుమడు సన్నీకి 8వ వార్డుకు చెందిన ఎర్రగొల్ల రమేశ్ రూ.5వేల నగదు అందజేశారు. అతడితో అల్లాడి వెంకటేశ్, స్వామి, చింతల స్వామి, ఎనిశెట్టి అశోక్, కన్నాపురం రమేశ్‌గౌడ్, అయ్యారి రాజు, అక్కల భూమయ్య, పోచమ్మల స్వామి, లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

'గణతంత్ర' ఏర్పాట్లు పూర్తి చేయాలి

- అమరుల కుటుంబాలకు ఇంటి స్థలాలు
- ప్రతి మండలంలో ఇంటర్నేషనల్ స్కూల్
- భూముల పరిశీలన పూర్తి చేయాలి
- స్వచ్ఛ పట్టణంగా మెదక్‌ను తీర్చిదిద్దాలి
- విద్యాసంస్థల్లో ప్రతిభాపోటీలు
- 18 ఏండ్లు నిండినవారు ఓటరుగా పేర్లు నమోదు చేసుకోవాలి
- మెదక్ కలెక్టర్ రాజర్షిషా

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

సమావేశానికి హాజరైన అధికారులు, సిబ్బంది

మెదక్, జనవరి 17 (నమస్తే తెలంగాణ): ఈ నెల 26న గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించి, దేశానికి సేవ చేసిన ప్రముఖులను స్మరించుకోవాలని సూచించారు. 26 ఉదయం 9గంటలకు కలెక్టరేట్‌లో కలెక్టర్ రాజర్షిషా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరిస్తారు. జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలపై ప్రసంగిస్తారు. కలెక్టరేట్‌లో నిర్వహించే కార్యక్రమానికి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. మెదక్ పట్టణాన్ని స్వచ్ఛతగా తీర్చిదిద్దాలని సూచించారు. అతిథులు, స్వాతంత్ర్య సమరయోధులను ఆహ్వానించాలని సూచించారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు

అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ రాజర్షిషా హెచ్చరించారు. కలెక్టరేట్‌లో బుధవారం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలన్నారు. అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే వాహనాలను సీజ్ చేసి, చట్టం ప్రకారం కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణ అమరుల కుటుంబాలకు ఇండ్ల స్థలాలతో పాటు మండలంలో ఏర్పాటు చేయనున్న ఇంటర్నేషనల్ స్కూల్ నిర్మాణానికి అవసరమైన స్థలాలతోపాటు భూముల పరిశీలన పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వ భూమిని కాపాడాలని, స్పెషల్ సమ్మరీ రివిజన్ -2024 పూర్తి చేయాలన్నారు. ధరణిలో పెండింగ్ ఫైల్స్‌తోపాటు ఇతర భూ సమస్యలను పూర్తిగా పరిష్కరించాలని ఆదేశించారు.

25న ఓటరు నమోదు ర్యాలీలు

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 17 : ఈ నెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించాలని కలెక్టర్ రాజర్షిషా ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మా ట్లాడుతూ.. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా జనవరి 25న జిల్లా కేంద్రంతోపాటు నియోజకవర్గ కేంద్రాలు, మండల కేంద్రాల్లో ఓటరు నమోదు అవగాహన ర్యాలీలు నిర్వహించాలన్నారు. అన్ని విద్యాసంస్థల్లో విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస, చిత్ర లేఖనం తదితర ప్రతిభా పోటీలు నిర్వహించాలని సూచించారు. ఉత్తమ ఈఎల్‌సీలు, బీఎల్వోలతోపాటు జిల్లాస్థాయిలో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తామన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో బీఎల్వోలు ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించాలని ఆదేశించారు. ఓటరు గుర్తింపు కార్డు అందజేయాలని సూచించారు. 'ఓటు వేయడం మించినది మరోకటి లేదు', 'నేను కచ్చితంగా ఓటు వేస్తాను' అనే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేలా ప్రచారం చేయాలన్నారు. 1 జనవరి 2024 నాటికి 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 20, 21 తేదీల్లో ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, రమేశ్, డీఆర్వో పద్మాశ్రీ, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఆర్డీవోలు అంబదాస్ రాజేశ్వర్, జయచంద్ర, మెదక్ తహసీల్దార్ శ్రీనివాస్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాకారులకు ప్రత్యేక గుర్తింపు ఉంటుంది

- మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

రంగంపేటలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

కొల్చారం, జనవరి 17 : క్రీడాకారులకు సమాజంలో ఎప్పటికీ ప్రత్యేకమైన గుర్తింపు ఉంటుందని నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అన్నారు. కొల్చారం మండలం రంగంపేటలో సంగారెడ్డి వాస్తవ్యుడు కానుకంటి రాజిరెడ్డి జ్ఞాపకార్థం ఐదు రోజులపాటు నిర్వహించిన రంగంపేట ప్రీమియర్ లీగ్ సీజన్-3 ముగింపు సమావేశం బుధవారం సర్పంచ్ బండి సుజాతారమేశ్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరైన మాట్లాడారు. రంగంపేటలో 100 నుంచి 150 మంది క్రీడాకారులు ఉండడం సంతోషకరమన్నారు. భగవంతుడు ఇచ్చిన శక్తి మేరకు నర్సాపూర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానన్నారు. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తి కలిగి ఉండాలని సూచించారు. విన్నర్ జట్టు కెప్టెన్ అల్లి వెంకటేశ్, రన్నర్ జట్టు కెప్టెన్ ఉసికె రాజు టీం, సీనియర్ విభాగంలో విన్నర్ జట్టు కెప్టెన్ కిశోర్, రన్నర్ జట్టు కెప్టెన్ గొండ కృష్ణతోపాటు జట్టు సభ్యులందరికీ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గౌరీశంకర్‌గుప్తా, ఎంపీటీసీ మాధవీ రాజాగౌడ్, సొసైటీ వైస్ చైర్మన్ మోత్కు మల్లేశం, బీఆర్ఎస్ నాయకుడు ముత్యంగారి సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వెదజల్లే పద్ధతితో ఖర్చులు ఆదా

చెన్నాపూర్‌లో వెదజల్లే పద్ధతిని పరిశీలిస్తున్న డీఏవో గోవింద్

జిల్లా వ్యవసాయాధికారి గోవింద్

శివ్వంపేట, జనవరి 17 : రైతులు వెదజల్లే పద్ధతిలో వ్యవసాయం చేస్తే ఖర్చులు ఆదా అవుతాయని జిల్లా వ్యవసాయాధికారి గోవింద్ అన్నారు. బుధవారం శివ్వంపేట మండలం చెన్నాపూర్ గ్రామంలో వెదజల్లే పద్ధతిలో సాగు చేస్తున్న వరిపొలాలను మండల వ్యవసాయాధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెదజల్లే పద్ధతిలో సాగు చేస్తే రైతులకు ఎకరాకు రూ.8 వేల నుంచి రూ. 10వేల వరకు ఖర్చులు ఆదా అవుతాయన్నారు. కార్యక్రమంలో ఏవో లావణ్య, ఏఈవోలు మాజీద్‌అలీ, రవి, రైతులు రాజిరెడ్డి, వీరబాబు తదితరులు ఉన్నారు.

మైనార్టీ గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

- ఉమ్మడి మెదక్ జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ డాక్టర్ నర్సింహ

డాక్టర్ నర్సింహ, రీజినల్ కో ఆర్డినేటర్

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 17 : తెలంగాణ మైనార్టీ గురుకుల విద్యాసంస్థల్లో(టీఎంఆర్ఈఐఎస్) వచ్చే విద్యాసంవత్సరానికి (2024-25) వివిధ తరగతుల్లో ప్రవేశాలకు ఈ నెల 18 నుంచి ఫిబ్రవరి 6 వరకు దరఖాస్తు చేసుకోవాలని ఉమ్మడి మెదక్ జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ డాక్టర్ నర్సింహ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలాంటి రుసుము లేకుండా దరఖాస్తు ప్రక్రియ ఉంటుందన్నారు. విద్యార్థి ఆధార్ కార్డు, పొటో, సంతకం ఉండాలన్నారు. ఆన్‌లైన్‌లో www.tmreistelangana.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా లేదా టీఎంఆర్ఈఐఎస్ మొబైల్ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఏవైనా సందేహలు ఉంటే స్థానిక మైనార్టీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని సూచించారు. 5వ తరగతిలో మైనార్టీ విద్యార్థులకు ముందు వచ్చిన వారికి సీట్లు కేటాయిస్తారు. 6, 7, 8వ తరగతులకు ముందుగా దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు సీట్లు కేటాయిస్తారు. (ఖాళీలు ఉంటే మాత్రమే)

ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు పదో తరగతిలో విద్యార్థుల మెరిట్ ఆధారంగా(జనరల్, ఓకేషనల్) సీట్లు కేటాయిస్తారు.

'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'లో ఇంటర్: విద్యార్థులకు ప్రవేశ పరీక్షతోపాటు ఇంటర్వ్యూ ద్వారా సీట్లు కేటాయిస్తారని వివరించారు.

శబరిమలకు అయ్యప్ప మాలధారులు

అయ్యప్ప ఆలయంలో భిక్ష స్వీకరిస్తున్న దీక్షధారులు

రామాయంపేట, జనవరి 17 : అయ్యప్పదీక్షధారులు బుధవారం రామాలయంపేటలోని అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, శబరిమలకు తరలివెళ్లారు. మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్‌తోపాటు మర్కు నగేశ్, సామల రవి, దోమకొండ శ్రీనివాస్ తదితరులు శబరిమలకు వెళ్లారు. ఏఎంసీ మాజీ చైర్మన్ యాదగిరి, బీఆర్ఎస్ నాయకులు మహేందర్‌రెడ్డి, నాగరాజు, చంద్రం, కౌన్సిలర్లు యాదగిరి, గంగాధర్ పూజలో పాల్గొన్నారు.

నీటి వనరులను కాపాడుకోవాలి

సెహగల్ ఫౌండేషన్ ప్రతినిధి నారాయణ, సర్పంచ్ రవి

కుంట పనులను ప్రారంభిస్తున్న సెహగల్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, సర్పంచ్ రవి

శివ్వంపేట, జనవరి 17 : నీటి వనరులను కాపాడుకోవాలని సెహగల్ ఫౌండేషన్ ప్రతినిధి నారాయణ, సర్పంచ్ పెద్దపులి రవి పిలుపునిచ్చారు. మండలంలోని పిల్లుట్ల గ్రామ శివారులోని వెల్మలవాని కుంట అభివృద్ధి పనులను బుధవారం ప్రారంభించారు. సెహగల్ ఫౌండేషన్ ప్రతినిధి వేమ నారాయణ మాట్లాడుతూ.. వెల్మలవాని కుంట మరమ్మతు పనులను రైతులు పర్యవేక్షించాలన్నారు. అన్నదాతలకు ఆసరాగా నిలుస్తూ, గ్రామానికి సోలార్ లైట్లు, చెరువులు, కుంటల మరమ్మతులు చేస్తున్న సెహగల్ సంస్థకు సర్పంచ్ రవి ప్రత్యేక కృతజ్ఞతలు తలిపారు. కార్యక్రమంలో సెహగల్ ఫౌండేషన్ సంస్థ ప్రతినిధి సాయికుమార్, మాజీ సర్పంచ్ సులోచనానర్సింహారెడ్డి, ఉప సర్పంచ్ దాసరి నర్సమ్మాదుర్గయ్య, నాయకులు హంసాన్‌పల్లి రాఘవరెడ్డి, బాసంపల్లి శ్రీధర్‌గౌడ్, ఫీల్డ్ అసిస్టెంట్ జోగు రాములు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు పోచాగౌడ్, చింత స్వామి, బుర్ర మహేశ్‌గౌడ్, గుల్లయ్యగారి సుదర్శన్, పిల్లి శ్రీనివాస్, ఈరన్ లచ్చయ్య, సంద్ర సత్యనారాయణ, దాసరి బుచ్చిబాలేశ్, బుర్ర అనిల్‌గౌడ్, దాసరి పోచయ్య, దాసరి ఎల్లయ్య, కర్రె సాయిలు, పెద్దపులి నర్సింహులు, పిల్లి తిరుపతి, రాయిని పాండు, జోగు ఏసు, మొనెగారి మహేశ్, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలి: సీపీఎం

ప్లకార్డులను ప్రదర్శిస్తూ నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 17 : జగిత్యాలలో భూపోరాట నాయకులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని బుధవారం మెదక్ పట్టణంలోని పోస్టాఫీస్ చౌరస్తా వద్ద సీపీఎం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేశం మాట్లాడుతూ.. సుమారు 4వేల మంది పేదలు జగిత్యాల పట్టణంలోని ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నారన్నారు. రెవెన్యూ, పోలీస్ అధికారులు గుడిసెలను కూల్చి వేస్తుండగా అడ్డుకున్న 30 మంది సీపీఎం నాయకులను అరెస్ట్ చేశారని తెలిపారు. జైలుకు పంపినవారిని వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం పేదప్రజలకు ఇండ్ల స్థలాలు ఇచ్చి, ఇంటి నిర్మాణానికి రూ.15 లక్షల ఆర్థికసాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నర్సమ్మ, బస్వరాజు, సంతోష్, లచ్చాగౌడ్, రాములు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

మనోహరాబాద్‌లో బస్సులు ఆపరా?

- జిల్లా ప్రభుత్వ అధికారి రిక్వెస్ట్ చేసినా.. బస్సు ఆపని ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్
- తూప్రాన్‌లో బిగి తిరిగి రావాల్సిన పరిస్థితి
- బస్సులు ఆపాలని ప్రయాణికుల డిమాండ్


నాలుగేండ్ల క్రితం మనోహరాబాద్‌లో ఎక్స్‌ప్రెస్ స్టాపును ప్రారంభిస్తున్న మెదక్ జడ్పీ చైర్‌పర్సన్ హేమలతాశేఖర్‌గౌడ్ (ఫైల్)

మనోహరాబాద్‌కు బస్సు టికెట్ తీసుకుంటున్న మెదక్ జడ్పీచైర్‌పర్సన్ హేమలతాగౌడ్(ఫైల్)

మనోహరాబాద్, జనవరి 17 : మనోహరాబాద్ మండల కేంద్రానికి, నగరానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగులు, చిరు ఉద్యోగులు, కూలీలు, ప్రజలు ఉదయం నుంచి సాయంత్రం వరకు మూడు షిఫ్టుల్లో రాకపోకలు సాగిస్తుంటారు. గతంలో మనోహరాబాద్‌లో ఆర్టీసీ బస్సులను ఆపేవారు. ఇప్పుడు స్టాప్ ఉన్నా.. బస్సులను ఆపడం లేదు. దీంతో మనోహరాబాద్‌కు రావాలంటే తూప్రాన్ వరకు టిక్కెట్ తీసుకోవాల్సి వస్తున్నదని ప్రయాణికులు వాపోతున్నారు. ఎక్స్‌ప్రెస్ బస్సులో సికింద్రాబాద్ నుంచి రూ. 80, మేడ్చల్ నుంచి రూ. 50 టికెట్ తీసుకొని వస్తున్నామని, ఆర్డినరీ బస్సులు పూర్తిగా తగ్గాయని తెలిపారు. అధిక ధర చెల్లించినా మనోహరాబాద్‌లో బస్సులను ఆపడం లేదంటున్నారు.

బుధవారం మేడ్చల్ నుంచి మనోహరాబాద్‌కు నానా తంటాలు పడ్డానని జిల్లాస్థాయి ప్రభుత్వ అధికారి ఆవేదన వ్యక్తం చేశారు. మేడ్చల్‌లో దుబ్బాక డిపోకు చెందిన బస్సు(ఏపీ 29జెడ్ 3332) లో ఎక్కి మనోహరాబాద్‌కు టికెట్ అడుగగా తూప్రాన్ వరకు రూ. 50 చార్జీ చేశాడని ఆరోపించారు. చార్జీ అధికమైన రిక్వెస్ట్ స్టాప్‌గా మనోహరాబాద్‌లో ఆపాలని కోరినా డ్రైవర్, కండక్టర్ వినలేదన్నారు. చేసేదేమి లేక తూప్రాన్‌లో బస్సు దిగి తిరిగి మనోహరాబాద్‌కు ఆటోలో రావాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్స్‌ప్రెస్, డీలక్స్ బస్సులను మనోహరాబాద్‌లో ఆపాలని అధికారులు, ప్రజలు కోరుతున్నారు. నాలుగేండ్ల క్రితం మెదక్ జడ్పీ చైర్ పర్సన్ హేమలతాగౌడ్ చొరవతో మనోహరాబాద్‌లో ఆర్టీసీస్టాప్ ఏర్పాటు చేసినా... ఇప్పుడు బస్సులను ఆపలేదని ప్రయాణికులు వాపోతున్నారు.

20న పాస్‌పోర్ట్ అదాలత్

సిటీబ్యూరో, జనవరి 17 (నమస్తే తెలంగాణ) : ఈ నెల 20న సికింద్రాబాద్‌లోని రీజినల్ పాస్‌పోర్ట్ కార్యాలయంలో పాస్‌పోర్ట్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు హైదరాబాద్ రీజినల్ పాస్‌పోర్ట్ అధికారి స్నేహజ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తుల ప్రక్రియలో ఏవైనా ఇబ్బందులు ఉంటే అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు అదాలత్ నిర్వహిస్తామన్నారు. పాస్‌పోర్టుకు సంబంధించి అన్నీ ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో హాజరుకావాలని సూచించారు.

టాలెంట్ స్ప్రింట్ ఫర్ ఉమెన్ ఇంజినీర్స్

దరఖాస్తులకు నేడు ఆఖరు తేదీ

శేరిలింగంపల్లి, జనవరి 17 : గుగూల్ సహకారంతో కొనసాగుతున్న టాలెంట్ స్ప్రింట్ ఫర్ ఉమెన్ ఇంజినీర్స్ 6వ ఎడిషన్ పోగ్రామ్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు టాలెంట్ స్ప్రింట్ వ్యవస్థాపక సీఈవో ఎండీ శాంతను పాల్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహిళా ఇంజినీర్‌కు ఉజ్వలమైన భవిష్యత్ కోసం సాంకేతిక సామర్థ్యాలను వెలికి తీయడానికి టాలెంట్ స్ప్రింట్ ఫర్ ఉమెన్ ఇంజినీర్స్ పోగ్రామ్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. మహిళా ఇంజినీర్స్ ప్రోగ్రామ్‌తో స్కాలర్‌షిప్ ఇస్తామని తెలిపారు. గచ్చిబౌలిలోని టాలెంట్ స్ప్రింట్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహిళా ఇంజినీర్స్ ప్రోగ్రామ్ దరఖాస్తులకు ఈనెల 18వ తేదీ (నేటివరకు) తుది గడువు అన్నారు. మొదటి సంవత్సరం ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.